క్లుప్తంగా

నేడు బస్తీ దవాఖానా ప్రారంభం

కాచిగూడ: గోల్నాక డివిజన్ సుందర్‌నగర్ బస్తీలో నూతనంగా ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాను ఈనెల 19న (నేడు) రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రారంభిస్తారని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. బస్తీ దవాఖానా ప్రారంభోత్సవ వేడుకల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

జాబ్‌మేళాకు స్పందన



జాబ్‌మేళాలో ఎంపికైన విద్యార్థులతో వెంకటరమణ దేవి

కాచిగూడ: చదువు ఒక్కటే ఉద్యోగానికి సరిపోదని, పోటీ సమాజానికి అనుగుణంగా యువత నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని తెలంగాణ యువతి మండలి ఎ.శ్యామలదేవి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ డి.వసుంధర సూచించారు. గురువారం బర్కత్‌పురలోని శ్యామలదేవి డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన జాబ్‌మేళాలో ఆమె పాల్గొని మాట్లాడారు. కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాలకు స్పందన వచ్చిందని, ఎంపికైన విద్యార్థినులను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వెంకటరమణ దేవి, వైస్ ప్రిన్సిపల్ వి.లావణ్య కుమారి, దీప్తి, శిరీష పాల్గొన్నారు.

'బీసీబంధు' అమలు చేయాలి

కాచిగూడ: ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు తెలంగాణలో బీసీ బంధు పథకం అమలు చేయాలని తెలంగాణ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పట్టభద్రులైన నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పరం విమర్శలు మానుకుని బీసీల అభివృద్ధి, సంక్షేమానికి చొరవ చూపాలన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



పారిశుద్ధ్య కార్మికులతో చర్చిస్తున్న కార్పొరేటర్

అంబర్‌పేట: డివిజన్‌లో మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు గోల్నాక డివిజన్ కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. గురువారం డివిజన్‌లో పారిశుద్ధ్య విభాగం సిబ్బంది, కార్మికులతో కలిసి పారిశుద్ధ్య నిర్వహణ అంశాలను కార్పొరేటర్ అడిగి తెలుసుకున్నారు. డివిజన్ వ్యాప్తంగా చెత్త తరలించే కుండీలు, కార్మికులకు కావాల్సిన సామగ్రి సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్, జీహెచ్‌ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ



కాచిగూడ: ప్రముఖ సంఘ సేవకురాలు పోతుమంచి సరసిజాదేవి ఆధ్వర్యంలో నిరుపేద ప్రజలకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న సెంట్రల్ జోన్ ఏసీపీ రామదాసు తేజ మాట్లాడుతూ ..మానవ సేవే మాధవ సేవ అని అన్నారు. పేదలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేసిన సరసిజాదేవిని అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మాధవి, బరిగి అయ్యప్ప, డాక్టర్ సుభాష్ గుప్తా, వైశాలి, శంకర్, అంజిరెడ్డి, కవిత పంకజ్ శ్రీనివాసన్ పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



మల్లేష్ కుమార్‌కు సన్మానిస్తున్న దృశ్యం

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: హిమాయత్‌నగర్ మండల తహసిల్దార్‌గా ఎస్‌పీఆర్. మల్లేష్ కుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. మల్లేష్ కుమార్ చార్మినార్ మండల తహసిల్దార్‌గా పనిచేసి హిమాయత్ మండలానికి రాగా ఇక్కడ పని చేసిన హేమలత బండ్లగూడకు బదిలీ అయ్యారు. రాష్ట్రీయ లోక్ జనశక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఇనుగాల బీమరావు, దళిత సంఘం నాయకులు రాయపాటి రవి, దుర్గం మోహన్ మల్లేష్‌కుమార్‌కు శాలువ కప్పి సన్మానించారు.

అన్నపూర్ణ.. ఆకలి తీర్చేనా

అలంకారప్రాయంగా అన్నపూర్ణ క్యాంటీన్

- 6 నెలలైనా అందుబాటులోకి రాని వైనం
- ప్రారంభించాలంటున్న స్థానికులు
- విస్మరిస్తున్న అధికారులు

అంబర్‌పేట: పేదల ఆకలి తీర్చే అన్నపూర్ణ క్యాంటీన్ అలంకార ప్రాయంగా మారింది. అన్ని హంగులతో నిర్మించి నెలలు గడుస్తున్న ప్రారంభానికి నోచుకోవడం లేదు. అంబర్‌పేట సీపీఎల్ రోడ్ తహసీల్దార్ కార్యాలయం వద్ద గత 6 నెలల క్రితం రూ. 5 భోజనం కేంద్రాన్ని జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో నిర్మించారు. అంబర్‌పేట నియోజకవర్గంలో ఉన్న అన్ని భోజన కేంద్రాల కన్నా ఇక్కడి కేంద్రాన్ని విశాలంగా ఎంతో సౌకర్యంగా నిర్మించారు. యుద్ధ ప్రతిపాదికన సుమారు రూ.14 లక్షలతో ఆరు నెలల క్రితం నిర్మించిన కేంద్రాన్ని ఇప్పటి వరకు ప్రారంభించకపోవడం శోచనీయం.

ఎప్పుడు ప్రారంభిస్తారో ఎవరికీ తెలిదు..

ఇక్కడ ఏర్పాటు చేసిన కేంద్రంతో ఎంతో పేదల ఆకలి తీర్చేందుకు దోహదపడుతుంది. తహసీల్దార్ కార్యాలయం, పోలీసు స్టేషన్, ప్రధాన రోడ్డు కూడలి కావడంతో ఎంతో పేదలకు ఈ కేంద్రం అందుబాటులో ఉంటుంది. అనువైన ప్రాంతంలో భోజన కేంద్రం ఏర్పాటు చేశారనుకుంటే ఆ కేంద్రాన్ని ప్రారంభించకపోవడం పేదలకు ఎదురు చూపులే మిగులుతున్నాయి. అన్ని హంగులతో నిర్మించిన రూ.5 భోజన కేంద్రం ఎప్పుడు ప్రారంభిస్తారో ఎవరికి తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. జీహెచ్‌ఎంసీ అధికార యంత్రాంగాన్ని అడిగితే ప్రారంభానికి సంబంధించిన పక్కా సమాచారం లేదంటున్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు సైతం సరైన సమాచారం తెలియదంటున్నారు. ఇప్పటికైనా ఇక్కడి కేంద్రాన్ని సత్వరమే ప్రారంభించాలని కోరుతున్నారు.



అంబర్‌పేట తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన భోజన కేంద్రం

విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలి



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

కాచిగూడ: ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు సాగాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ పిలుపునిచ్చారు. గురువారం శ్రీ చైతన్య నల్లకుంట బ్రాంచ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్స్, బంగారు పథకాలను ఎమ్మెల్యే అందజేసి మాట్లాడారు. తల్లిదండ్రులు విద్యార్థుల భవిష్యత్‌పై ఎన్నో ఆశలు పెంచుకుని ఉంటారని, వారి కలలను నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం సతీష్, సనమ్‌జీ, రాజేంద్ర ప్రసాద్, ప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్, వేణు, నీలగిరి, హరి, సన్ని, రవి పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ..

చిక్కడపల్లి: పేద మధ్యతరగతి ప్రజలకు వైద్యసేవలు అందించడంలో సీఎంఆర్‌ఎఫ్ వరం అని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ పేర్కొన్నారు. నియోజకవర్గంలోని పలువురికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను గురువారం ఆయన ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఠాజైసింహ, వల్లాల శ్యామ్‌యాదవ్, వై.శ్రీనివాస్, శ్రీధర్‌రెడ్డి, పోతుల శ్రీకాంత్ పాల్గొన్నారు.

'ఓబీసీలపై ప్రభుత్వం చిన్నచూపు'



సమ్మేళనానికి వెళ్తున్న నాయకులు

కాచిగూడ: ఓబీసీల పట్ల కేసీఆర్ ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందని బీజేపీ ఓబీసీ మోర్చా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేశబోయిన శ్రీధర్ అన్నారు. బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో నాగోల్‌లోని శుభం కన్వెన్షన్ హాల్లో గురువారం జరిగిన ఓబీసీ సమ్మేళన కార్యక్రమానికి కేశబోయిన శ్రీధర్ ఆధ్వర్యంలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీల ఓట్లతో గెలిచి అధికారంలోకి వచ్చిన సీఎం కేసీఆర్ బీసీల పట్ల ఎందుకు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని గుర్తు చేశారు. కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్, పార్టీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు సి.వినోద్ యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు.

న్యాయవాదులకు రక్షణ చట్టం తీసుకురావాలి



మాట్లాడుతున్న న్యాయవాదులు

కవాడిగూడ: న్యాయవాదులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు తక్షణమే న్యాయవాదుల కోసం రక్షణ చట్టాన్ని తీసుకురావాలని హైకోర్టు న్యాయవాదులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. గురువారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద న్యాయవాదులకు రక్షణ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయవాదులు బాలాజీ, అనిల్ కుమార్, నాగరాజు, దస్తి, రమణ, అశోక్ మాట్లాడుతూ.. న్యాయవాదులపై రోజు రోజుకు దాడులు, హత్యలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జూనియర్ న్యాయవాదులకు రూ.15 వేల నుంచి రూ. 20వేల వరకు స్టైఫండ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిటీ సివిల్ కోర్టు, నాంపల్లి కోర్టులో న్యాయవాదులపై దాడులు జరగకుండా భద్రత చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కేంద్రం కుట్రలను తిప్పికొట్టాలి



ధర్నాలో పాల్గొన్న వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నేతలు

కవాడిగూడ: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేసేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని ఉపాధి హామీ చట్ట పరిరక్షణ కమిటీ నేతలు పిలుపునిచ్చారు.గ్రామీణ ఉపాధి హామీ చట్టం రక్షణకోసం పట్టణ పేదలకు ఉపాధి పనులకు విస్తరింప చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో పాల్గొన్న దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) జాతీయ కార్యదర్శి పి.శంకర్ మాట్లాడుతూ.. గత ఎనిమిదేళ్లుగా కేంద్ర బడ్జెట్‌లో నిధులను తగ్గిస్తూ పథకాన్ని నీరుగారుస్తున్నారన్నారు. చేసిన పనికి వారం రోజులలో చెల్లించాల్సిన వేతనాలు చెల్లించకుండా శ్రమ దోపిడీకి పాల్పడుతున్నారని అన్నారు. ఎస్ బాల మల్లేష్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణ ఉపాధి హామీ చట్టం పనులను ఎత్తివేయాలని కుట్రలు చేస్తోందని వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో నర్సింహ, కాంతయ్య, శివలింగం, వెంకటయ్య, పులికల్పన, బి. నాగన్న పాల్గొన్నారు.

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న రాంచందర్

కాచిగూడ: విద్యార్థులు పూర్తిగా పాఠ్యపుస్తకాలపైన ఆధారపడకుండా సొంత పరిజ్ఞానంతో నైపుణ్యాలను పెంపొందించుకోవాలని హైదరాబాద్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (హెచ్‌ఎంఏ) అధ్యక్షుడు వి.రాంచందర్ అన్నారు. కాచిగూడలోని ఆర్.జీ. కేడియా కాలేజీలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మేనేజ్‌మెంట్ రంగంలో విస్తృతమైన అవకాశాలున్నాయని, విద్యార్థులు వాటిని అందిపుచ్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆర్.జీ.కేడియా కళాశాలలో విద్యార్థులను యువ మేనేజర్లుగా తీర్చిదిద్దడానికి శిక్షణ కార్యక్రమాలను చేపట్టేలా హెచ్‌ఎంఏ మార్వాడీ శిక్షా సమితితో ఒప్పందం చేసుకున్నారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా విద్యను అభ్యసించాలన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌ఎస్ కార్యదర్శి సురేంద్ర లూనియా, సీఏ ఎస్‌బీ కాబ్రా, డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ డీవీజీ కృష్ణ, ప్రొఫెసర్ వందన సాంబ, డాక్టర్ శ్రీనివాస్ కుమార్, డాక్టర్ శ్రీహరి, డాక్టర్ సుధాకర్, డాక్టర్ ప్రదీప్ పాల్గొన్నారు.

వ్యవసాయం, సాహితీసేద్యం చేసిన గొప్పకవి గంగుల సాయిరెడ్డి

చిక్కడపల్లి: రైతుగా నాగలి పట్టి వ్యవసాయం చేస్తూనే మరోవైపు కలం పట్టి సాహితీ సేద్యం చేసిన గొప్ప కవి గంగుల సాయిరెడ్డి అని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండా శ్రీనివాస్ అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో గురువారం శ శతాబ్దిపూర్వ మహనీయుల యాదిలో కార్యక్రమాలలో భాగంగా శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో జన్మించిన భాగవత కర్త పోతన వ్యవసాయం చేస్తూనే కావ్య రచనలు చేశారని తదుపరి కాలంలో సాయిరెడ్డి ఆయనను అనుసరించిన భూమిపుత్రుడు అని వివరించారు. పర్యాటక అభివృద్ధి సంస్థ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ.. రైతుల జీవితాల్లోని చీకటి వెలుగులను కవితా వస్తువుగా సాహిత్యా రచనలు చేసిన సాయిరెడ్డి సామాజిక సంస్కర్త అన్నారు. గీత రచయిత వడ్డేపల్లి కృష్ణ మాట్లాడుతూ.. సాయిరెడ్డి వంటి పలు తెలంగాణ కవుల రచనలు నేటి తరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. గానసభ అధ్యక్షులు కళా జనార్దన మూర్తి మాట్లాడుతూ.. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో గానసభను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటే తమవంతుగా సహకరిస్తామన్నారు.

పరిశుభ్రతకు సహకరించాలి



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్

అంబర్‌పేట: బహిరంగంగా చెత్త వేయకుండా మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణకు ప్రజలు సహకరించాలని బాగ్‌అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ బీ.పద్మావెంకట్‌రెడ్డి కోరారు. గురువారం జీహెచ్‌ఎంసీ సర్కిల్-16 ఎఎంఓహెచ్ డాక్టర్ జ్యోతిబాయితో కలిసి డివిజన్‌లో అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటింటికి వచ్చే స్వచ్ఛ ఆటోలకు తడి-పొడి చెత్త వేరుచేసి అందించాలని కార్పొరేటర్ తెలిపారు. డివిజన్‌లో బహిరంగ చెత్త వేయకుండా పారిశుద్ధ్య విభాగం సిబ్బంది చొరవ తీసుకోవాలని సూచించారు.

మహిళ అదృశ్యం



వల్లపు రమ

నల్లకుంట: విధులకు వెళ్తున్న అని ఇంట్లో చెప్పి వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన ఘటన నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్సై అంజయ్య వివరాల ప్రకారం.. ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న వల్లపు రమ(37), భర్త పిల్లలతో కలిసి అడిక్‌మెట్ పోచమ్మ బస్తీలో నివాసముంటుంది. పదేళ్ల నుంచి భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో ఇటీవల రమ తన ఇద్దరు కుమార్తెలను తీసుకుని అదే బస్తీలో నివాసముండే తన పుట్టింటికి వచ్చేసింది. మార్చి 18న డ్యూటీకి వెళ్లిన రమ రాత్రైనా ఇంటికి రాలేదు. గతంలో (జనవరి) కూడా ఇద్దరు పిల్లలను తీసుకుని వెళ్లిపోయిన ఆమె 15 రోజుల తర్వాత తిరిగి వచ్చింది. ఈ సారి కూడా వస్తుందని ఎదురు చూసి ఎంతకీ రాకపోవడంతో గురువారం తల్లి వల్లపు రాజేశ్వరి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

'దర్శన్ బస్సు'లను వినియోగించుకోవాలి

రాంగోపాల్‌పేట్: ప్రతి శని, ఆదివారాల్లో హైదరాబాద్ నగరంలోని పర్యాటక కేంద్రాలను సందర్శించేందుకు ఆర్టీసీ అందుబాటులోకి తెచ్చిన హైదరాబాద్ దర్శన్ బస్సులను వినియోగించుకోవాలని డిప్యూటీ ఆర్ఎం అపర్ణ కల్యాణి తెలిపారు. రెతిఫైల్‌లోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. శని, ఆదివారాల్లో ఉదయం 8.30 గంటలకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఎదురుగా ఉండే ఆల్ఫా హోటల్ వద్ద నుంచి ఈ బస్సు బయలుదేరి రాత్రి 8.30 గంటలకు అక్కడికే చేరుకుంటుందన్నారు. ఈ బస్సులో గైడ్ ఉండి ప్రతి పర్యాటక ప్రదేశం యొక్క చరిత్ర, దాని ప్రాముఖ్యతను వివరిస్తారన్నారు. పెద్దలకు రూ.250, పిల్లలకు రూ.130, ఏసీ బస్సులో పెద్దలకు రూ.450, పిల్లలకు రూ.340 చెల్లించి అన్ని ప్రదేశాలను సందర్శించి రావచ్చని చెప్పారు.

'గురుకుల' దరఖాస్తుల గడువును పొడిగించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: గురుకుల డీఎల్, జేఎల్ దరఖాస్తుల గడువును మరో 15 రోజులు పొడిగించాలని ఓయూ విద్యార్థి జేఏసీ అధ్యక్షులు ఎనుగంటి రాజునేత కోరారు. సాంకేతిక కారణాలతో పాటు, ఇతర అనేక సమస్యలతో అర్హత గల నిరుద్యోగులు దరఖాస్తులు చేసుకోలేకపోయారని తెలిపారు. చాలా ఏళ్ల తర్వాత పెద్ద సంఖ్యలో అధ్యాపక ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదలైనందున దరఖాస్తు చేసుకునేందుకు గడువును పొడిగించాలన్నారు.

అభివృద్ధి పనులపై పర్యవేక్షణ ఉండాలి



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

కాచిగూడ: నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై అధికారులు, సిబ్బంది పర్యవేక్షణ ఉండాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సూచించారు. కాశీరాంజీరా బస్తీలో రూ.35లక్షల వ్యయంతో చేపడుతున్న డ్రైనేజీ పైపులైన్ పనులను గురువారం ఆయన జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బందితో కలిసి పర్యవేక్షించారు. అనంతరం కాశీరాంజీరా, ఇందిరానగర్‌బస్తీ, బసంత్ కాలనీలో పర్యటిస్తూ స్థానికులతో మాట్లాడారు. డ్రైనేజీ పైపులైన్ పనుల సందర్భంగా కాంట్రాక్టర్, సిబ్బంది డబ్బులు వసూలు చేస్తున్నారని స్థానికులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. డబ్బులు ఇచ్చే వరకు తమ ఇళ్ల వద్ద పనులను చేయడం లేదని ఆరోపించారు. ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తుండటం పట్ల ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటన పునరావృతంఅయితే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

- కాశీరాంజీరా బస్తీలో డ్రైనేజీ పైపులైన్ నిర్మాణపు పనులు పూర్తి కాగానే రూ.38లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు.
- వీరన్నగుట్ట బస్తీలో రూ.15.60 లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన షెడ్డు పనులను ఎమ్మెల్యే పర్యవేక్షించారు. నిర్మాణం పూర్తయిందని త్వరలోనే నల్లా, డ్రైనేజీ కనెక్షన్ ఏర్పాటుతో పాటు, విద్యుత్ మీటర్, ఫ్యాన్లు, గేటు పెట్టి ప్రజలకు త్వరలోనే అందుబాటులోకి తీసుకు వస్తామన్నారు. చిన్నపాటి శుభాకార్యాలు, బస్తీ సమావేశాలు ఏర్పాటు చేసుకోవడానికి ఈ షెడ్డు ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

ఫౌంటెయిన్ ఏర్పాటు..

కాచిగూడలోని శ్యాంబాబా దేవాలయం చౌరస్తాలో వాటర్ ఫౌంటెయిను ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. ఈ ఫౌంటెయిన్, మొక్కల ఏర్పాటుతో కాచిగూడ డివిజన్‌కే ఓ ప్రత్యేకత రానుందన్నారు. మున్నూరు కాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్‌బోర్డు, మ్యాడం అంజయ్య హాల్ వెనుక రోడ్డుపైన ఎమ్మెల్యే తన సొంత ఖర్చు రూ.2లక్షలతో గార్డెనింగ్ ఏర్పాటు చేస్తున్నారు. ఆ పనులను హార్టికల్చర్ అధికారులు, సిబ్బందితో కలిసి ఈ సందర్భంగా ఎమ్మెల్యే పర్యవేక్షించారు. ఎమ్మెల్యే వెంట జలమండలి ఏఈ భావన, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్, బీఆర్ఎస్ కాచిగూడ డివిజన్ అధ్యక్షుడు ఎర్ర భీష్మదేవ్, పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం..

అంబర్‌పేట: విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ఉన్న చదువుల్లో రాణించాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ సూచించారు. అంబర్‌పేట లఖోటియా ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను గురువారం ఎమ్మెల్యే అభినందించారు. 9కి పైగా జీపీఏ సాధించిన 18 మంది విద్యార్థులను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

జీఓం నెం 45ను రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న గడప శ్రీహరి

అంబర్‌పేట: ప్రభుత్వం జారీ చేసిన జీఓ నంబరు 45 గంగపుత్రుల హక్కులను కాలరాసేలా ఉందని ప్రదేశ్ గంగపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షులు గడప శ్రీహరి తెలిపారు. గురువారం బాగ్‌అంబర్‌పేటలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చేపల వృత్తి హక్కులు గంగపుత్రులకే అని అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన సీఎం కేసీఆర్ జీఓ 45తో ఫిషరీస్ కార్పొరేషన్‌కు ముదిరాజ్ కులానికి చెందిన పిట్టల రవీందర్‌ను ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. ఓటు బ్యాంకు రాజకీయం కోసం గంగపుత్రులకు దక్కాల్సిన హక్కులను ముదిరాజ్‌లకు భాగస్వామ్యం కల్పించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా 3 వేల గంగపుత్ర సొసైటీలు ఉంటే ముదిరాజ్‌లవి 15 వేల సొసైటీలు ఉన్నాయని ఇప్పటికైనా జీఓ నంబరు 45 రద్దు చేసి ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్‌గా గంగపుత్రులను నియమించాలన్నారు. ఈ సమావేశంలో శివరత్నం, చంద్ర ప్రకాశ్, ఓంప్రకాశ్, మల్లేశం, బాలయ్య పాల్గొన్నారు.

మనతోష్ మండల్ సంస్మరణ సభ



నివాళి అర్పిస్తున్న వేదకుమార్ తదితరులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఫోరం ఫర్ ఏ బెటర్ హైదరాబాద్ సభ్యులు డాక్టర్ మనతోష్ మండల్ సంస్మరణ సభ గురువారం ఫోరం ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మండల్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఫోరం ఫర్ ఏ బెటర్ హైదరాబాద్ చైర్మన్ మణికొండ వేదకుమార్ మట్లాడుతూ.. మండల్ బ్యాంకులో పని చేసి పదవీ విరమణ పొందిన తర్వాత ఫోరంలో సభ్యత్వం తీసుకొని వివిధ సేవ కార్యక్రమాల్లో భాగస్వాములు అయ్యారని గుర్తు చేశారు. మండల్ సేవలు చిరస్థాయిలో నిలిచిపోతాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎం.హెచ్.రావు, మాలిక్, శోభసింగ్, మజహర్ హుస్సేన్, పి.నరహరి, వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఎట్టకేలకు శివానంద్ నగర్‌లో డ్రైనేజీ పైప్‌లైన్ పనులు షురూ



డ్రైనేజీ పైప్‌లైన్ పనుల కోసం మార్కింగ్ చేయిస్తున్న జలమండలి అధికారులు

నల్లకుంట: నల్లకుంట డివిజన్ శివానంద్‌నగర్‌లో డ్రైనేజీ, వాటర్ సమస్యలు అధికంగా ఉండేది. బస్తీ వాసులు సమస్యను బస్తీ వాసులు స్థానిక ఎమ్మెల్యేతో జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ నూతన డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణం కోసం రూ. 22 లక్షలు మంజూరు చేసి నాలుగు నెలల క్రితం శంకుస్థాపన చేశారు. ఆ సమయంలో బస్తీలోని కొందరు డ్రైనేజీ పైప్ లైన్ హుస్సేన్ నాలాకు కలపాలని, అలాగే బస్తీ పైభాగంలో ఉండే ఇళ్లకు తాగు నీటి సమస్య ఉందని, సమస్య పరిష్కారం కోసం నాలుగు ఇంచుల వాటర్ పైప్ లైన్ వేయాలని జలమండలి అధికారులను కోరారు. డ్రైనేజీ పైప్‌లైన్‌ను హుస్సేన్ సాగర్ నాలాలో కలుపుతామని హామీతో పాటు నాలుగు ఇంచుల పైపులైన్ పనులకు అనుమతులు వచ్చే వరకు డ్రైనేజీ పైపుల నిర్మాణ పనులు చేపటొద్దని బస్తీలోని కొందరు తెగేసి చెప్పడంతో పనులు ప్రారంభం కాలేదు. ఈ క్రమంలో విజ్ఞానపురి కాలనీ జలమండలి మేనేజర్ షాకీర్ ఇటీవల బస్తీ వాసులతో మాట్లాడారు. ఖర్చు అధికమైనప్పటికీ డ్రైనేజీ పైప్‌లైన్ హుస్సేన్ సాగర్ నాలా వరకు వేయిస్తామని చెప్పారు. నిర్దీత సమయంలో డ్రైనేజీ పైపుల నిర్మాణం పనులు ప్రారంభిచకుంటే మంజూరైన నిధులు తిరిగి వెనక్కి పోతాయని, ఆ తర్వాత డ్రైనేజీ పైప్‌లైన్ పనులు పునః ప్రారంభం కష్టమని చెప్పారు. ప్రస్తుతం ఈ పనులు పూర్తి చేయించిన తర్వాత బస్తీ వాసులు కోరినట్టు వాటర్ పైప్‌లైన్ పనులు కూడా చేపడతామని బస్తీ వాసులతో చెప్పారు. దీంతో బస్తీ వాసులు తొలుత డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపట్టేందుకు అంగీకరించడంతో గురువారం పోలీసుల పహారాలో పనులను ప్రారంభించారు.

రేపు రామసత్యనారాయణకు సినీవిరాట్ బిరుదు ప్రదానం



చిక్కడపల్లి: ఫిల్మ్‌నగర్‌లోని తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి హాల్‌లో ఈ నెల 20న శతాధిక చిత్ర నిర్మాత తెలుగు నిర్మాత తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి కోశాధికారి టి.రామసత్యనారాయణను సత్కరించి సినీ విరాట్ బిరుదు ప్రదానం చేయనున్నట్లు వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు తెలిపారు. త్యాగరాయగానసభ గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు.